డొక్కా సీతమ్మ క్యాంటీన్‌లో అన్నదానం

అన్నదానంలో వడ్డిస్తున్న మణిభాస్కర్

ప్రజాశక్తి - జగ్గంపేట

స్థానిక మెయిన్ రోడ్డులో ప్రతీ మంగళవారం దాతల సహాకారంతో నిర్వహిస్తున్న డొక్కా సీతమ్మ క్యాంటీన్లో అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. మంగళవారం రాజమహేంద్రవరంకు చెందిన వైష్ణవి కన్సల్టెన్సీ జి.మాణిక్యాలరావు ఆర్థిక సాయంతో నిర్వహించిన ఈ అన్నదానంలో సూరంపాలెం ఉప సర్పంచ్ స్వామిని మణి భాస్కర్ పాల్గొని పేదలకు భోజనాలు వడ్డించారు. ఈ కార్యక్రమంలో గోపి స్వామి, రామవరం ఎంపిటిసి సభ్యులు దొడ్డా శ్రీను, బుజ్జి, నాయుడు పాల్గొన్నారు.

వెంటాడుతున్న వరుణుడు

- జిల్లాపై మరో అల్పపీడన ప్రభావం
- మూడు రోజుల పాటు భారీ వర్షాలు
- ఆందోళనలో అన్నదాతలు
- అప్రమత్తమైన యంత్రాంగం
- వేటకు వెళ్లొద్దని హెచ్చరికలు

యంత్రాలతో వరి కోతలు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

అన్నదాతలను వరుసగా ప్రకృతి వైపరీత్యాలు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. గత నెలలో వరద ప్రభావంతో వేలాది మంది రైతులు నష్టాలకు గురయ్యారు. వారంతా ఇప్పుడిప్పుడే తేరుకుంటున్న తరుణంలో మరో తీవ్ర అల్పపీడనం రైతులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఆగ్నేయ బంగాళాఖాతంలో ఇది ఏర్పడడంతో మంగళవారం నాటికి తీవ్ర అల్పపీడనంగా మారినట్లు వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. దీని ప్రభావంతో 3 రోజుల పాటు జిల్లాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేస్తున్నారు.

జిల్లాలో ఈ ఏడాది 2.19 లక్షల ఎకరాల్లో వివిధ పంటలను రైతులు సాగు చేస్తున్నారు. ఇందులో 2.12 లక్షల ఎకరాల్లో వరి సాగవుతుంది. ఖరీఫ్‌లో వేలమందు రైతులు నష్టపోయారు. గత నెల రెండో వారంలో వరదల రూపంలో అన్నదాతల ఆశలను నేల పాలు చేసింది. కొద్ది రోజుల్లోనే పంట చేతికొస్తుందని భావించిన రైతులకు కన్నీళ్ళు మిగిల్చింది. భారీ ఈదురు గాలులకు తోడు వదలని వర్షాలతో ఒక్క రూపాయి కూడా పెట్టిన పెట్టుబడి రాదని కర్షకులు కంటతడి పెడుతున్నారు. నేటికీ అవస్థలు పడుతూనే ఉన్నారు. పిఠాపురం, కిర్లంపూడి, పెద్దాపురం, గొల్లప్రోలు తదితర మండలాల్లో రైతులు భారీ నష్టాన్ని చవిచూశారు. ప్రధానంగా ఏలేరు వరదలు కారణంగా భారీ ముంపునకు గురవడంతో పంటలు నాశనం అయ్యాయి.

వరదలు, వర్షాలతో 62 వేల ఎకరాల్లో నష్టం

ఏలేరు వరదలు, వర్షాల వల్ల కాకినాడ జిల్లాలో 20 మండలాల్లో 34,095 మంది సన్న, చిన్నకారు రైతులకు చెందిన 62 వేల ఎకరాల్లో వరికి నష్టం వాటిల్లింది. 12 ఎకరాల్లో ఉద్యాన పంటలకు నష్టం జరిగిందని అధికారులు అంచనా వేశారు. 17 మండలాల్లో 14 నివాస గృహాలు పూర్తిగా దెబ్బతినగా, పాక్షికంగా 35 పక్కా గృహాలు, 63 కచ్చా గృహాలు మరమ్మతులకు గురయ్యాయి. 69 చోట్ల 46 కిలోమీటర్ల మేర రాష్ట్ర రహదారులు, 179 కి.మీ ప్రధాన జిల్లా రహదారులు మొత్తంగా 225 కి.మీ.రోడ్లు దెబ్బతిన్నాయని ఆర్‌అండ్ బి అధికారులు అంచనా వేశారు. 2.463 కి.మీ పొడవున 26 ప్రధాన సాగునీటి పారుదల పనులు దెబ్బతిన్నట్లు అంచనా వేశారు.

ఈదురుగాలులు, వర్షాలు

బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం వలన జిల్లాలో గురువారం వరకూ భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నదని వాతావరణ శాఖ అధికారులు ప్రకటించారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ షాన్‌మోహన్ కింది స్థాయి అధికారులను అప్రమత్తం చేశారు. తీర ప్రాంతంలో ఉన్న ప్రజలకు ముందస్తు జాగ్రత్తలు చెప్పాలని సూచించారు. కాలువలు, చెరువులు, కరకట్టల పటిష్టతను పరిశీలించాలని ఇరిగేషన్ అధికారులకు అదేశాలిచ్చారు. అవసరమైన జెసిబిలు, పొక్లెయిన్లు, జనరేటర్లు ఇతర సామగ్రిని సిద్ధం చేసుకోవాలన్నారు.

కోతలపై డైలామా

కొద్ది రోజుల్లో పంట కోతకు వచ్చే అవకాశం ఉంది. మైదాన ప్రాంతంలో వర్షాభావ పరిస్థితుల కారణంగా కొంత ఆలస్యంగా వరినాట్లు వేయగా బోర్లు కింద వరి సాగు చేస్తున్న కొన్ని భూముల్లో ఇప్పుడిప్పుడే కోతలు మొదలయ్యే అవకాశం ఉంది. మిగిలిన చోట్ల వరి కోత దశకు చేరుకుంది. దీంతో రైతులు డైలామాలో పడ్డారు.

కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు

వాతావరణ శాఖ హెచ్చరికలు నేపథ్యంలో జిల్లా, డివిజన్, మండల స్థాయిలలో కంట్రోల్ రూమ్ లు ఏర్పాటు చేయాలని కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశించారు. ఈ నెల 15 నుంచి 17వ తేదీ వరకు భారీ వర్షాలు, వరదలు సంభవించవచ్చని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిందన్నారు. డివిజన్, మండల స్థాయిలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వర్షాలు కారణంగా ఎదైనా సమస్య తలెత్తితే వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ -1800 425-3077. సమాచారం అందించాలని ఆయన తెలిపారు.

సమావేశం లో మాట్లాడుతున్న సిఐటియు నాయకుడు నూకల బలరాం

సిఇఓ సర్క్యులర్‌ను ఉపసంహరించుకోవాలి

ప్రజాశక్తి - కాకినాడ

సహకార బ్యాంకు సిఇఒ ఇచ్చిన సర్క్యులర్‌ను తక్షణమే ఉపసంహరించుకోవాలని ఎపి స్టేట్ అగ్రికల్చర్ కోపరేటివ్ సొసైటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు తోట వెంకటరామయ్య, రాష్ట్ర కోశాధికారి పెంకే సత్యనారాయణ డిమాండ్ చేశారు. మంగళవారం యూనియన్ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా విస్తృత సమావేశం కాకినాడ జిల్లా అధ్యక్షులు కడగల ఆదినారాయణ అధ్యక్షతన సహకార రంగ ఉద్యోగుల భవనంలో జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు సిఇఒ 7వ తేదీన ఇచ్చిన సర్క్యులర్లో 2019 తర్వాత సహకార ఉద్యోగులుగా నియమింపబడిన వారిని తొలగించాలని, 60 సంవత్సరాల వయసు పూర్తి అయిన వారిని తొలగించి, కోర్టు అనుమతిలేని వారు పొందిన జీతాలను తిరిగి చెల్లించాలని ఇచ్చిన ఆదేశాలను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో నిరవధిక సమ్మెకు సిద్ధపడతామని హెచ్చరించారు. 15వతేదీ నుంచి నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరుకావాలని, అధికారులు పెట్టె జూమ్ మీటింగులు, ఆన్‌లైన్ వీడియో కాన్ఫరెన్స్‌లను బహిష్కరిస్తున్నట్లు ఉద్యమ కార్యాచరణను ప్రకటించారు. 21వతేది కాకినాడ డిసిసిబి బ్యాంకు వద్దకు ఉద్యోగులందరూ హాజరయ్యి సర్కిలర్‌కి వ్యతిరేకంగా జరిగే ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా సిఐటియు ప్రధాన కార్యదర్శి నూకల బలరాం, కోనసీమ జిల్లా అధ్యక్షులు వై.రామచంద్రరావు, కాకినాడ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నరసరాజు, తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు కెవివి సత్యనారాయణ, ఉద్యోగులు పాల్గొన్నారు.

అందరికీ పని కల్పించాలని ధర్నా

ప్రజాశక్తి - కాకినాడ

కలెక్టరేట్ వద్ద నినాదాలు చేస్తున్న లారీ యజమానులు

కాకినాడ లారీ యజమానుల అసోసియేషన్లో అందరికీ సమాన పని కల్పించేలా తగు చర్యలు తీసుకోవాలని లారీ యజమానులు కోరారు. మంగళవారం కలెక్టరేట్ వద్ద అసోసియేషన్‌కు చెందిన కొందరు లారీ యజమానులు ధర్నా చేశారు. కాకినాడ పోర్టులో ఎగుమతి దిగుమతులు బాగా తగ్గాయని అందువల్ల తమకు ఉపాధి కరువై చాలా ఇబ్బందులు పడుతున్నామన్నారు. అలాగే తమ సభ్యుల అనుమతులు లేకుండా ఒక యూనియన్ ఎంపిక జరిగిందని, అది తమ నిబంధనలకు విరుద్ధంగా ఉండడంతో దాన్ని తిరిగి రద్దుచేసి తిరిగి ఎన్నికల నిర్వహించేలా ఎంఎల్‌ఎలు వనమాడి వెంకటేశ్వరరావు, పంతం వెంకటేశ్వరరావు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో లారీ యాజమానులు కడియాల అంజిబాబు, గూడవల్లి మృత్యుంజయరావు, గుమ్మెళ్ల సత్తిబాబు, శేఖర్, సత్యనారాయణ పాల్గొన్నారు.

రైతులు మోసపోకుండా చూడాలి

ప్రజాశక్తి - ఏలేశ్వరం

ఖరీఫ్ రైతుల ధాన్యం అమ్మకాల్లో దళారుల నుంచి రైతులు మోసపోకుండా వ్యవసాయ సిబ్బంది సహకారం అందించాలని ఎంపిపి గొల్లపల్లి బుజ్జి అన్నారు. మంగళవారం డేటా ఎంట్రీ హెల్పర్లు, టెక్నికల్ అసిస్టెంట్లకు శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కనీసమద్దతు ధర క్వింటాలుకు గ్రేడ్ ఏ రకం రూ.2,320, సాధారణ రకం రూ.2,300, 75 కేజీలకు గ్రేడ్ ఏ రకం రూ.1740, సాధారణ రకం రూ.1725లుగా నిర్ణయించిందన్నారు. రైతులకు మిల్లర్లకు మధ్య దళారుల ప్రమేయం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై అధికారులు, రైతు సేవా కేంద్ర సిబ్బంది, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - కరప

స్థానిక మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం సాదాసీదాగా సాగింది. ఎంపిపి పెంకె శ్రీలక్ష్మి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంపిడిఒ ఎ.అనుపమ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారుల పనితీరును సమీక్షించారు. వేములవాడ ఎంపిటిసి శ్రీనివాస్ మాట్లాడుతూ తమ గ్రామంలో తాగునీరు కలుషితం అవుతుందని, తరచుగా విద్యుత్ సమస్య ఉత్పన్నం అవుతుందన్నారు. పెద్దాపురపాడు సర్పంచ్ సరస్వతి మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో చేపడుతున్న పనులు ప్రజలకు తెలియజేయాలని కోరారు. ఈ సమావేశంలో తహశీల్దార్ ఎన్.సత్యనారాయణ, ఇఒపిఆర్‌డి సలాది వెంకట శ్రీనివాస్, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు ఎ.రాజేష్, సానా ఈశ్వర్‌ప్రసాద్, కెబి.కృష్ణవేణి, డాక్టర్ శ్రీనివాస్‌నాయక్ పాల్గొన్నారు.

వినతిపత్రం ఇస్తున్న ఎల్‌ఐసి ఏజెంట్లు

ఎల్‌ఐసి ఏజెంట్ల ధర్నా

ప్రజాశక్తి - పెద్దాపురం

ఏజెంట్లకు చెల్లించే కమీషన్‌పై కోతను నిరసిస్తూ ఎల్‌ఐసి ఏజెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ఎల్‌ఐసి బ్రాంచ్ కార్యాలయం వద్ద ధర్నా జరిగింది. అనంతరం బ్రాంచ్ మేనేజర్ గోపాల్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు అప్పాన నాగేశ్వరరావు, గుండెల జగదీశ్వరరావు మాట్లాడుతూ ఏజెంట్ కమీషన్‌లో కోత విధించడం అన్యాయమన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కోశాధికారి బివిఎస్‌ఆర్.శాస్త్రి, ఉపాధ్యక్షులు కొండపల్లి అర్జున్‌రావు, సామిరెడ్డి గోపి, సహాయ కార్యదర్శి వాసంశెట్టి గంగ, గౌరవాధ్యక్షులు ఎస్ గౌరీపతిరావు పాల్గొన్నారు.

ఎంఎల్‌సి ఓటరు నమోదుపై అవగాహన

ప్రజాశక్తి - సామర్లకోట

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పట్టభద్రుల నియోజకవర్గ ఎంఎల్‌సి ఎన్నికల్లో ఓటు నమోదుపై అవగాహన కార్యక్రమం జరిగింది. మంగళవారం హుస్సేన్‌పురం గ్రామంలో గ్రామ నాయకులు చల్లా బుజ్జి ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళి 2021 నవంబర్ ఒకటో తేదీ నాటికి డిగ్రీ పూర్తయిన యువతి, యువకులకు ఫారం 18 ద్వారా ఓటరుగా నమోదు కావాలని వివరించారు. ఈ కార్యక్రమంలో కోట అప్పారావు పాల్గొన్నారు.

సిహెచ్‌సి ఆధునికీకరణకు చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి - పిఠాపురం

సిహెచ్‌సిలో ఎక్స్‌రే విభాగాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్

పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని (సిహెచ్‌సి) ఆధునికీకరించడంతోపాటు అవసరమైన వైద్య సిబ్బందిని నియమించడం జరుగుతుందని కలెక్టర్ షాన్‌మోహన్ అన్నారు. మంగళవారం సిహెచ్‌సికి కోరమండల్ ఇంటర్నేషనల్ సంస్థ సిఎస్‌ఆర్ కింద ఏర్పాటు చేసిన ఎక్స్ రే మిషన్, ఇతర వైద్య పరికరాలను మాజీ ఎంఎల్‌ఎ ఎస్‌విఎస్ ఎస్ఎన్.వర్మ, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ మర్రెడ్డి శ్రీనివాసు, కోరమండల్ ఇంటర్నేషనల్ సంస్థ ప్రతినిధులతో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం సిహెచ్‌సికి వస్తున్న ఒపి వివరాలు, ఆసుపత్రి అవసరాలు, మరుగుదొడ్ల పరిస్థితి, తాగునీరు, ఇతర సదుపాయాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ సూచన లు మేరకు సిహెచ్‌సిని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి పిఠాపురం చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలకు వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురానున్నట్లు చెప్పారు. నిత్యం నమోదవుతున్న ఒపి సంఖ్యకు అనుగుణంగా ఆసుపత్రిని ఆధునీకరించడం తోపాటు, అవసరమైన మౌలిక సదు పాయాలు కల్పించడం, సిబ్బందిని నియమించడం జరుగు తుందన్నారు. సిహెచ్‌సికి కోరమండల్ ఇంటర్నేషనల్ సంస్థ రూ.15 లక్షలతో ఎక్స్‌రే మిషన్ సమకూర్చిందన్నారు. నేటి నుంచి ఎక్స్‌రే సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. సిహెచ్‌సిని ఏరియా ఆసుపత్రిగా ఆధునీకరించేందుకు అవసరమైన ప్రతిపాదనని సిద్ధం చేయడం జరిగిందని, ఈ పనులు త్వరలోనే ప్రారంభమవుతాయన్నారు. సిహెచ్‌సిలో అవసరమైన రోడ్లు, భవనాల మరమ్మతులు మెయింటినెన్స్ నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని, వీటితో ఆసుపత్రిని అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. డిప్యూటీ సీఎం ఆదేశాలతో పిఠాపురం నియోజకవర్గానికి సంబంధించి 38 అంశాలకు గుర్తించామన్నారు. ఈ పనులను రానున్న దీపావళి నాటికి ఒక్కొక్కటి కొలిక్కి తీసుకురావడం జరుగుతుందన్నారు.

భోజన నాణ్యతపై అసహనం

పట్టణంలోని ఆర్‌ఆర్‌బిహెచ్‌ఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను కలెక్టర్ పరిశీలించారు. మరుగుదొడ్ల నిర్వహణ సరిగ్గా లేదని మెరుగు పర్చాలని ఆదేశించారు. మధ్యాహ్నం భోజనం నాణ్యతను పరిశీలించిన ఆయన అసహనం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యమైన విద్యను బోధించడంపాటు విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించేందుకు కృషి చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాల్లో సిహెచ్‌సి సూపరింటెండెంట్ డాక్టర్ సుజాత, మున్సిపల్ కమిషనర్ కనకారావు, తహశీల్దార్ వివి.గోపాలకృష్ణ, కోరమండల్ ఇంటర్నేషనల్ సంస్థ కాకినాడ జిల్లా యూనిట్ హెడ్ సిహెచ్.శ్రీనివాసరావు, జిఎం హెచ్‌ఆర్ పి.పద్మనాభం, సిఎస్‌ఆర్ మేనేజర్ కె.వంశీకృష్ణ, జిల్లా క్రీడాభివృద్ధి సంస్థ అధికారి బి.శ్రీనివాసరావు, పాఠశాల హెచ్‌ఎం, ఇతరులు పాల్గొన్నారు.

ఘనంగా కలాం జయంతి

ప్రజాశక్తి - యంత్రాంగం

కలాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఆదిత్య నాయుడు

కాకినాడ ఆదిత్య డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మాజీ రాష్ట్రపతి పిజె.అబ్దుల్‌కలాం జయంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆదిత్య డిగ్రీ, పిజి కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బిఇవిఎల్.నాయుడు పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన ఎన్ఎస్ ఎస్ బృందాన్ని ఆదిత్య విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రెటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణా రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ సత్యనారాయణ, ఇన్‌ఛార్జ్ మూర్తి, ఎన్ఎస్ఎస్ పిఒలు టి.తేజేశ్వరరావు, గౌరీప్రియ పాల్గొన్నారు. **పెద్దాపురం** స్థానిక శ్రీ ప్రకాష్ సినర్జీ స్కూల్లో అబ్దుల్ కలాం జయంతిని ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణలోని ఆయన శిలా విగ్రహానికి ప్రొఫెసర్ సంతానం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అకాడమిక్ కో- ఆర్డినేటర్లు, ఉపా ధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. **కరప** మండలంలోని నడకుదురు జడ్‌పి ఉన్నత పాఠశాలలో కలాం జయంతిని నిర్వహించారు. కలాం చిత్రపటానికి హెచ్‌ఎం టి.మురళి పూలమాలలను వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. **జగ్గంపేట** స్థానిక గుర్రప్పాలెం రోడ్‌లోని శ్రీ స్వామి వివేకానంద విద్యాసంస్థల్లో కలాం విగ్రహానికి విద్యాసంస్థల ప్రిన్సిపల్ అండ్ కరెస్పాండెంట్ డాక్టర్ ఒమ్మి రఘురామ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నవర గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న నిర్వాహకులు

భవిత ఆధ్వర్యంలో అవగాహనా ర్యాలీ

ప్రజాశక్తి - పెద్దాపురం, సామర్లకోట, పిఠాపురం

అక్షరాలు చదవ డంలో ఇబ్బందులు పడే వికలాంగ బాలలకు అవగాహన పెంచేందుకు స్థానిక భవితా కేంద్రం సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ కార్య క్రమంలో ఎంఇఒలు ఇ.ప్రభా కర్‌శర్మ, వి.రామకృష్ణచౌదరి మాట్లాడుతూ అక్షరాలు సక్రమంగా, స్పష్టంగా పలకలేని బాలలకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో లూథరన్ హైస్కూల్ హెచ్‌ఎం ఎన్.ఫిలిప్‌రాజు, కరస్పాండెంట్ జి.నళిని, భవితా సిబ్బంది పి.దుర్గాప్రసాద్‌రెడ్డి, బి.ఆనందరావు, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే సామర్లకోట బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్ హెచ్‌ఎం తోటకూర సాయిరామకృష్ణ ఆధ్వర్యంలో నవర గ్రామంలో ప్రపంచ డిస్లెక్సియాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒలు శివరామకృష్ణయ్య, పుల్లయ్య పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసి ఛైర్మన్ కె.దుర్గారాంబాబు, వైస్ ఛైర్మన్ జి.హేమకొండయ్యదొర, హెచ్‌ఎం సిహెచ్.సత్యవతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే పిఠాపురం భవిత కేంద్రం, రాజీవ్ గాంధీ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులు డిస్లెక్సియాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ శ్యాంబాబు, హైస్కూల్ హెచ్‌ఎం టి.రమేష్ మాట్లాడారు. ఈ కార్యాక్రమంలో భవిత సిబ్బంది బి.రాజ్‌కుమార్, కె.ప్రసూన, హైస్కూల్ పీడీ సుధా రాణి, ప్రసాద్ పాల్గొన్నారు.

10 రోజుల్లో వీధి దీపాలకు మరమ్మతులు

ప్రజాశక్తి - ఏలేశ్వరం

సమావేశంలో మాట్లాడుతున్న ఛైర్‌పర్సన్ సత్యవతి

నగర పంచాయతీ పరిధిలో 10 రోజుల్లోగా విద్యుత్ దీపాలను పూర్తి స్థాయిలో మరమ్మతులు చేపట్టాలని ఛైర్‌పర్సన్ అలమండ సత్యవతి ఆదేశించారు. మంగళవారం కమిషనర్ ఎం.సత్యనారాయణ అధ్యక్షతన వార్డు కార్యదర్శులు, పంచా యతీ సిబ్బందితో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల నుంచి ఫిర్యాదులు రాకముందే డ్రెయినేజీలు, రోడ్లు వీధి దీపాల సమస్యలు పరిష్కరించాలన్నారు. కమిషనర్ మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతకు గుడ్ మార్నింగ్ ఏలేశ్వరం పేరుతో ప్రతిరోజు ఒక వార్డును యూనిట్‌గా తీసుకుని సమస్యలు పరిష్కరిస్తున్నామన్నారు. ప్రజలు, సిబ్బంది సహకారంతో నీట్ ఏలేశ్వరంగా రూపుదిద్దుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ అలమండ చలమయ్య, టిపిఒ జెడి.ఆనంద్, ఎఇ అనూష, సానిటరీ ఇన్‌స్పెక్టర్ కుమార్‌రాజా పాల్గొన్నారు.

సిసి రోడ్ల పనులకు శంకుస్థాపనలు

ప్రజాశక్తి - సామర్లకోట, తాళ్లరేవు

సామర్లకోటలో పల్లె పండుగ కార్యక్రమంలో ఎంఎల్ఎ చినరాజప్ప

సామర్లకోట మండలం పనసపాడు గ్రామంలోని పలు ప్రాంతాల్లో రూ.45 లక్షలతో సిసి రోడ్ల నిర్మాణాలకు ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ దశలవారీగా పల్లె పండుగ కార్యక్రమంలో అన్ని గ్రామాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చీకట్ల వెంకటేష్, ఎఇ శ్రీనివాసరావు, కూటమి నాయకులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే తాళ్లరేవు మండలంలోని పలు గ్రామాల్లో రూ.3.43 కోట్లతో సిసి రోడ్లకు ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి నాటికి పనులు పూర్తి చేయాలని అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. సంక్రాంతి పండుగకు గ్రామాలు కొత్త శోభ సంతరించు కోవాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రాయుడు సునీత, ఎఎంసి ఛైర్మన్ కుడుపూడి శివన్నారాయణ, నాయకులు మందాల గంగ సూర్యనారాయణ, కట్ట త్రిమూర్తులు, వాడ్రేవు వీరబాబు, ఎంపిడిఒ కె.సత్యనారాయణ, మండల సర్పంచుల సమాఖ్య అధ్యక్షులు టిల్లపూడి నాగేశ్వరరావు, పాల్గొన్నారు.

తాళ్లరేవులో శంకుస్థాపనలో ఎంఎల్ఎ సుబ్బరాజు

వికలాంగురాలికి ఉపకరణాన్ని అందిస్తున్న ఎంఎల్ఎ సత్యప్రభ

వికలాంగుల సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

వికలాంగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎంఎల్ఎ వరుపుల సత్యప్రభ అన్నారు. మంగళవారం వికలాంగులకు ప్రభుత్వం అందిస్తున్న ఉపకరణాల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలో 155 మంది లబ్ధిదారులకు రూ.26 లక్షల విలువ చేసే ఉపకరణాలను అందించామన్నారు. గతంలో తన భర్త వికలాంగుల కోసం అనేక ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించారని గుర్తు చేశారు. అలాగే సదరన్ క్యాంపులు నిర్వహించి నిబంధనల ప్రకారం అర్హత కల్గిన వారికి సర్టిఫికెట్లను అందించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ ఎంవి.కుమార్‌బాబు, టిడిపి నాయకులు కొమ్మల కన్నబాబు, సాంబశివరావు, బద్ది రామారావు, అమరావతి వెంకట్రావు, పాల్గొన్నారు.

పథకాల వినియోగంతో ఆర్థికాభివృద్ధి

ప్రజాశక్తి - పెద్దాపురం

సమావేశంలో మాట్లాడుతున్న ఎపిఎం సూర్యనారాయణ

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవడం ద్వారా మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చునని వెలుగు ఎపిఎం సూర్యనారాయణ అన్నారు. మంగళవారం స్థానిక స్త్రీ శక్తి భవనంలో మండల మహిళా సమాఖ్య అధ్యక్షులు అమ్ములు అధ్యక్షతన గ్రామ మహిళా సంఘం సభ్యుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మహిళ బ్యాంకుల ద్వారా పొందుతున్న రుణ సదుపాయంతో జీవనోపాదులను పెంపొందించుకునేందుకు కృషి చేయాలన్నారు. తీసుకున్న రుణాన్ని క్రమం తప్పకుండా పొదుపు, రుణ వాయిదాలు చెల్లించాలన్నారు. ఈ సమావేశంలో మండల సమాఖ్య కార్యదర్శి మంగతాయారు, గ్రామ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

కోనపాపపేటలో చోరీ

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

మండలంలోని కోనపాపపేట గ్రామంలో సోమవారం రాత్రి చోరీ జరిగింది. స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం.. చింతకాయ జగన్నాథం భవాని మాల వేసి కుటుంబ భ్యులతో కలిసి విజయవాడ వెళ్లారు. మంగళవారం ఉదయం జగన్నాథం ఇంటి తలుపులు తెరిచి ఉన్నాయని ఇంటి ఎదురుగా ఉన్న వారు గమనించి జగన్నాథం కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. దీంతో ఆయన ఇంటికి చేరుకుని బీరువాలను పరిశీలించగా లక్ష రూపాయల నగదు, 15 కాసులు బంగారం దొంగలించినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బైక్ చోరీ నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి - జగ్గంపేట

స్థానిక ఆర్టిసి కాంప్లెక్స్ వద్ద బైకును దొంగిలించిన నిందితుడిని పోలీసులు అరెస్టు చేసినట్టు ఎస్ఐ టి.రఘునాథరావు తెలిపారు. సిసి పుటేజీని ఆధారంగా చేసుకుని నిందితుడి కోసం గాలించగా ఆత్రేయపురం మండలం వెలిచేరుకు చెందిన తుపాకుల రామదాసు బైక్ చోరీకి పాల్పడినట్లు గుర్తించామన్నారు. నిందితుడి కోసం గాలిస్తుండగా జగ్గంపేట నుంచి గోకవరం రోడ్డు వైపు వెళ్తున్నట్టు వచ్చిన సమాచారంతో మంగళవారం అతనిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. ముద్దాయి నుంచి బైకును స్వాధీనం చేసుకుని కోర్టులో హాజరుపర్చినట్టు తెలిపారు.

ఏలేరు కాలువలో మత్స్యకారుడు మృతి

ప్రజాశక్తి - ఏలేశ్వరం

ఏలేరు ప్రధాన కాలువలో చేపలు వేటకు వెళ్లి మత్స్యకారుడు మృతి చెందిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. ఈ మేరకు ఎస్ఐ ఎన్.రామలింగేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక నెయిలి పేటకు చెందిన గుదే శ్రీను(52) యథావిధిగా సోమవారం ఉదయం ట్యూబుపై ఏలేరు ప్రధాన కాలువలో వేటకు వెళ్లాడు. చేపల వేటాడే క్రమంలో నీటి ప్రవాహానికి ట్యూబ్ పైనుంచి అదుపుతప్పి నీటిలో పడిపోయాడు. గజ ఈతగాళ్ల సహకారంతో కుటుంబ సభ్యులు గాలింపు చేపట్టగా శ్రీను మృతదేహం లభ్యమయింది. మృతుని భార్య రూత్ కృష్ణవేణి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

ప్రజాశక్తి - గండేపల్లి

మండలంలోని ఎల్లమిల్లి గ్రామ శివారున గల రెస్టారెంట్లో పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో నలుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ శివనాగ బాబు తెలిపారు. వారి నుంచి రూ.32,300 నగదును స్వాధీనం చేసుకుని, వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

చోరీకి పాల్పడిన వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి - రాజానగరం

చోరీకి పాల్పడిన వ్యక్తిని అరెస్టు చేశామని రాజానగరం సిఐ ఎస్.ప్రసన్నవీరయ్యగౌడ్ తెలిపారు. ఆ వివరాలను మంగళవారం ఆయన మీడియాకు వెల్లడించారు. నరేంద్రపురం గ్రామానికి చెందిన సంగిశెట్టి సీతారామ నేయులు ఈ నెల 3వ తేదీ రాత్రి 8.30 గంటల సమయంలో ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లారు. తిరిగి రాత్రి 12.30 వచ్చారు. ఆ సమయంలో ఇంట్లో ఉన్న 14 కాసుల బంగారం వస్తువులు, రూ.20 వేల నగదు చోరీకి గురైనట్లు గుర్తించారు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ మనోహర్ కేసు దర్యాప్తు చేపట్టారు. గ్రామానికి చెందిన సంగిశెట్టి శివన్నారాయణ అను నిందితుడిగా గుర్తించి విచారణలో నేరం అంగీకరించాడు. నిందితుడు 5 కాసుల బంగారాన్ని రాజమండ్రిలో అమ్మేగా మిగిలిన 9 కాసులు, రూ.10 వేలు నగదు స్వాధీనం చేసుకున్నారు. బంగారం విలువ రూ.1.50 లక్షలు ఉంటుందని తెలిపారు. ఈ మేరకు ఎస్ఐ, సిబ్బందిని సిఐ అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడు మృతి

ప్రజాశక్తి - గోపాలపురం

పశ్చిమగోదావరి జిల్లా టి.నర్సాపురం మండలం బొర్రంపాలెం గ్రామానికి చెందిన తెలుగు ఉపాధ్యాయుడు కొనకళ్ల గణేష్కుమార్(41) గోపాలపురం శివారు మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. గణేష్కుమార్ చాగల్లు మండలం బ్రాహ్మణగూడెం హైస్కూల్లో తెలుగు ఉపాధ్యాయులుగా పని చేస్తున్నారు. భార్య కుమార్తెతో కలిసి సమిశ్రగూడెంలో నివాసం ఉంటున్నారు. మంగళ వారం ఉదయం సెలవు పెట్టి బొర్రంపాలెం గ్రామానికి బైక్పై బయలుదేరాడు. గోపాలపురం శివారు అమరావతి కాటా వద్దకు వచ్చేసరికి కొయ్యల గూడెం వైపు నుంచి గోపాలపురం వస్తున్న లారీ ఎదురుగా వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో గణేష్ కుమార్ తీవ్రంగా గాయపడ్డారు. అతన్ని స్థానికులు వెంటనే గోపాలపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం రాజమండ్రిలోని ప్రయివేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. ఆయన భార్య కొనకళ్ల బేబీఅరిలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ కె.సతీష్ కుమార్ తెలిపారు.

పల్లంలో జోరుగా యానాం మద్యం

ప్రజాశక్తి - కాట్రేనికోన

మండల పరిధిలోని తీర ప్రాంత మత్స్యకార గ్రామమైన పల్లం తీర గ్రామంలో జాతర సందర్భంగా మంగళవారం బహిరంగంగా, జోరుగా యానాం మద్యాన్ని విక్రయించారు. ఓ పక్కన పోలీసులు కాపలా ఉన్నా యానాం చీప్ లిక్కర్ అమ్మకాలు జరిగాయి. యానాంలో రూ.50కి కొనుగోలు చేసి రూ.150 నుంచి రూ.250కు అమ్మకం సొమ్ము చేసుకుంటూ అమాయక మత్స్యకార ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు మద్యం విక్రేతలు. ఇంత జరుగుతున్నా కాట్రేనికోన మండలంలోని యానాం మద్యం అమ్మకాలు లేకుండా స్వయంగా మమ్మిడివరం ఎక్సైజ్ ఎస్ఐ తప్పుడు నివేదికను కలెక్టర్కు సమర్పించడం పట్ల పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

ఉద్యోగ భద్రత ఏదీ..?

- వినతులను పట్టించుకోని పాలకులు
- గాల్లోనే ప్రభుత్వ మద్యం షాపుల సిబ్బంది జీవితాలు

ఆందోళన చేస్తున్న ప్రభుత్వ మద్యం సిబ్బంది (ఫైల్ ఫోటో)

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

బాబు వస్తే జాబ్ వస్తుందంటూ గడిచిన సార్వత్రిక ఎన్నికల్లో కూటమి నేతలు ఊదర గొట్టారు. అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ మద్యం షాపుల్లో ఐదేళ్లుగా సేవలందించిన సిబ్బంది జీవితాలను గాల్లో కలిపేశారు. కూటమి ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన మద్యం పాలసీతో వందలాది సిబ్బంది జీవితాలు నేడు రోడ్డున పడ్డాయి.

గత వైసిపి ప్రభుత్వ పాలనలో మద్యం అమ్మకాలను ప్రభుత్వమే నిర్వహించేలా నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ మద్యం దుకాణాల నిర్వహణ కోసం ఒక్కో షాపునకు ఒక సూపర్వైజర్, ముగ్గురు సేల్స్మెన్స్, రాత్రి సమయంలో షాపు భద్రత కోసం వాచ్మెన్ను నియమిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అందుకు అనుగుణంగానే అప్పటి వరకూ ఉన్న ఎక్సైజ్ శాఖ స్థానంలో సెబ్ను తీసుకొచ్చింది. సెబ్ ఆధ్వర్యంలో ఆయా ప్రభుత్వ మద్యం దుకాణాల నిర్వాహణకు అవసరమైన సిబ్బందిని నియమించింది. ఆవిధంగా జిల్లాలోని 157 మద్యం దుకాణాల నిర్వాహణకు సిబ్బందిని అధికారులు నియమించారు. జిల్లావ్యాప్తంగా 157 మంది సూపర్వైజర్లు, ఆయా దుకాణాల్లో సేల్స్ను బట్టి 400 మంది సేల్స్మెన్స్, 220 మంది వాచ్మెన్స్ నియమితులయ్యారు. గత ఐదేళ్లుగా ఆయా ప్రభుత్వ మద్యం దుకాణాల్లో చాలీ చాలని వేతనాలతో వీరింతా విధి నిర్వాహణలో ఉన్నారు. మొదటి మూడు నెలలు ఎపిఎస్డిసిఎల్ ద్వారా అవుట్ సోర్సింగ్ విధానంలో సిబ్బందిని తీసుకున్నారు. అనంతరం రాష్ట్రవ్యాప్తంగా రెడ్డి ఎంటర్ప్రైజెస్కి నిర్వాహణ బాధ్యతను అప్పగించడంతో సిబ్బందిని ఆ కంపెనీ ద్వారా కాంట్రాక్టు విధానంలో సిబ్బంది పని చేశారు. అయితే రెండు, మూడేళ్ల తరువాత సంబంధిత కంపెనీ సిబ్బందికి వేతనాలు చెల్లించే క్రమంలో చేసిన తప్పిదాలతో ప్రభుత్వం జోక్యం చేసుకుని థర్డ్ పార్టీకి నిర్వాహణ బాధ్యతను అప్పగించింది. వేతనాల చెల్లింపులో జరుగుతున్న జాప్యంతో సిబ్బంది తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, జీతాలను పెంపుదల చేయాలనే డిమాండ్ను తెరపైకి తెచ్చారు. అధికారులు, ప్రజాప్రతినిధులను కలిసి వినతులు అందచేశారు. అయితే వీరి డిమాండ్లను పట్టించుకోకపోగా ఉద్యమాలు అంటే తొలగిస్తామని అధికారులు బెదిరింపులకు గురిచేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం కొద్ది నెలలపాటు థర్డ్ పార్టీ ద్వారానే వేతనాల చెల్లింపులు జరిగాయి. అయితే ఆగష్టు, సెప్టెంబర్ నెలలకు సంబంధించి నిర్వాహణ బాధ్యతను ఎస్ఆర్ఆర్ ప్రాజెక్టు అనే సంస్థకు ప్రభుత్వం అప్పగించింది. అక్టోబర్ 16వ తేదీ నుంచి ప్రయివేటు మద్యం అమ్మకాలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది.

తమ బతుకులకు భరోసా ఏదీ?

ఐదేళ్ల చాలీచాలనీ వేతనాలతో ప్రభుత్వానికి సేవలందించిన తమ బతుకులకు భరోసా ఏదీ అని సిబ్బంది ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. వైసిపి ప్రభుత్వంలో తమకు ఉద్యోగాలు కల్పించినప్పటికీ తగిన భరోసా ఇవ్వకుండా మా జీవితాలను గాలిలోకి వదిలేశారని వారు వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని సంబంధిత శాఖ అధికారులకు, ప్రజాప్రతినిధులను కలిసి విజ్ఞప్తులు చేసినా పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ మద్యం పాలసీకి తాము వ్యతిరేకం కాదని, ఎటువంటి ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలు చూపకుండా తొలగించడం అన్యాయమని, మా కుటుంబాల పరిస్థితిని పరిగణలోకి తీసుకుని న్యాయం చేయాలని ఆంధ్రప్రదేశ్ స్టేట్ బేవరేజెస్ సూపర్వైజర్ అండ్ సేల్స్మెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు సబ్బతి చిట్టిబాబు కోరారు. లేదంటే జిల్లా వ్యాప్తంగా ఉద్యమం చేయడానికి కార్యచరణ చేపడతామని ఆయన హెచ్చరించారు.

ప్రభుత్వాలు మారితే ఉద్యోగాలు తొలగిస్తారా..?

గత 5 ఏళ్ల నుంచి ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న ఉద్యోగులందరినీ బేషరతుగా కొనసాగించి ఉద్యోగ భద్రత కల్పించాలి. ప్రభుత్వాలు మారినప్పుడల్లా మద్యం పాలసీలు మారడంతో అప్పటివరకు పనిచేస్తున్న ఉద్యోగులే బలిపశువులుగా మారుతున్నారని, తక్షణం వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టుల్లో వీరిని భర్తీ చేయాలని సిఐటియు డిమాండ్ చేస్తుంది.

చెక్కల రాజకుమార్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి.

సమావేశంలో పాల్గొన్న మంత్రులు, ఎంఎల్ఎలు, కూటమి నాయకులు

పట్టభద్రుల ఎంఎల్సి ఎన్నికల్లో

కూటమి అభ్యర్థులను గెలిపించుకుంటాం

మంత్రి నిమ్మల రామానాయుడు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

త్వరలో జరగబోయే పట్టభద్రుడు ఎంఎల్సి ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు గెలిపించుకుంటామని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. ఉమ్మడి తూర్పు-పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్సి ఎన్నికల ఓటరు నమోదు ప్రక్రియపై రాజమహేంద్రవరంలోని హోటల్ మంజీరా కన్వెన్షన్ హాల్లో మంగళవారం సమావేశం జరిగింది. తొలుత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళుర్పించారు. ఎంఎల్సి ఎన్నికలకు సంబంధించి ఓట్ల నమోదు ప్రక్రియ నవంబరు నాటికి పూర్తి చేయాలని కోరారు. అభ్యర్థి ఎంపిక ప్రక్రియ అధిష్టానం పరిధిలో ఉందని త్వరలోనే వెల్లడిస్తారని ఈ సందర్భంగా తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా ఇంచార్జ్ మంత్రిగా తనను నియమించడం చాలా సంతోషంగా ఉందన్నారు. మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు రాష్ట్రం వెంటిలేటర్పై ఉందన్నారు. ప్రధాని మోడీ సాయంతో వెంటిలేటర్ నుంచి ఆక్సిజన్ తీసుకునే స్థాయికి రాష్ట్రం వచ్చిందన్నారు. పోలవరం ప్రాజెక్ట్ను కేంద్రం సహాయంతో పూర్తిచేస్తామన్నారు. ఇందులో భాగంగానే కేంద్రం రూ.12,500 కోట్లను కేటాయించిందన్నారు. లిక్కర్ పాలసీపై వైసిపి నాయకులు ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతున్నారన్నారు. లిక్కర్ టెండర్లలో 90 వేల దరఖాస్తుల ద్వారా రూ.1,800 కోట్లు ఆదాయం వచ్చిందన్నారు. వారం పది రోజుల్లో ఇసుక సమస్యనూ తీరుస్తామన్నారు. మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ త్వరలో జరగబోయే పట్టభద్రులు ఎంఎల్సి ఎన్నికలకు కూటమినేతలంతా కలిసి వ్యవహారచన చేశామన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమం వైపు పయనిస్తుందన్నారు. ఈ సమావేశంలో టిడిపి అధ్యక్షులు పల్లా శ్రీనివాస్, ఎంఎల్ఎలు ఆదిరెడ్డి శ్రీనివాస్, బత్తుల బలరామకృష్ణ, పంతం నానాజీ, వేగుళ్ల జోగేశ్వరరావు, నిమ్మకాయల చినరాజప్ప తదితరులు పాల్గొన్నారు.

తప్పని ట్రాఫిక్ కష్టాలు

ప్రజాశక్తి - సామర్లకోట

మాధవపట్నం వద్ద ట్రాఫిక్ జామ్

కాకినాడకు వెళ్లాలంటే ట్రాఫిక్ కష్టాలు తప్పడం లేదు. మండలంలోని మాధవపట్నం వద్ద రోడ్డు పూర్తిగా శిథిలమైంది. దీంతో సామర్లకోట నుంచి కాకినాడకు 20 నిమిషాల్లో చేరుకోవాల్సిన ప్రయాణం 40 నిమిషాలైనా చేరుకోలేని పరిస్థితి ఏర్పడుతోంది. దారి పొడవునా రహదారికి గోతులు పడటం, మాధవపట్నం వద్ద వాహనాలన్నీ ఒకే వైపుగా వెళ్ళాల్సి రావడంతో ట్రాఫిక్ సమస్య అధికమవుతోంది. సరస్వతి విద్యాపీఠం వద్ద నుంచి మాధవపట్నం సెంటర్ దాటాలంటే ఏ వాహనానికైనా అయినా అరగంట సమయం పడుతుందని ప్రయాణికులు చెబుతున్నారు. అక్కడి ఆంజనేయస్వామి ఆలయం వైపు రోడ్డుమార్జిన్ కొంతదూరం కోతకు గురికావడంతో వాహనదారులు రోడ్డు దిగే పరిస్థితి ఉండటం లేదు. దీనికితోడు రోడ్డు మొత్తం గుంతలతో ప్రమాదకరంగా మారడంతో వాహనదారులు ఆచితూచి వెళ్ళాల్సి రావడంతో రాకపోకలకు తీవ్ర జాప్యం జరుగుతుంది. ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని సంబంధిత శాఖ అధికారులు రోడ్డుకు మరమ్మతులు చేపట్టడంతోపాటు, ట్రాఫిక్ రాకపోకలను క్రమబద్దీకరించేందుకు ట్రాఫిక్ సిబ్బందిని ఏర్పాటు చేయాలని ప్రయాణీకులు కోరుతున్నారు.

దోమ పోటు నివారణపై అవగాహన

ప్రజాశక్తి - పెద్దాపురం

రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారి

వరి పంటకు వస్తున్న దోమ పోటును నివారిణపై రైతులకు అవగాహన కార్యక్రమం జరిగింది. మంగళవారం మండలంలోని వడ్లమూరు రైతు సేవా కేంద్రం వద్ద సర్పంచ్ దుర్గా వరలక్ష్మిదేవి అధ్యక్షతన పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. రైతులకు వరి పంటలో దోమపోటు నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కె.సంజయ్కుమార్, పశువైద్యాధికారి డాక్టర్ కోటి, వ్యవసాయ విస్తరణాధికారి ఎన్వివి. ప్రసాద్, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి - యానాం రూరల్

యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని పలువురు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక ఎస్ఆర్కె ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో రెడ్ రిబ్బన్ క్లబ్, ఎన్ఎస్ఎస్ యూనిట్ల సంయుక్త ఆధ్వర్యంలో 'మాదకద్రవ్యాల వ్యసనం- శారీరక, మానసిక స్థితులపై ప్రభావం' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వరుగు భాస్కర్ రెడ్డి, బిపి.సైరాస్కుమార్ మాట్లాడుతూ యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా మాదకద్రవ్యాలను వినియోగించడం వల్ల జరిగే అనర్థాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ రీజనల్ కో- ఆర్డినేటర్ కృష్ణసుధాకర్, ఎన్ఎస్-ఎస్ పిఒలు డాక్టర్ చెల్లె నరేష్, ఎస్.శ్రీనివాసరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీల్లో శారదా విద్యార్థిని ప్రతిభ

ప్రజాశక్తి - యానాం రూరల్

పుదుచ్చేరిలో జరిగిన జాతీయ స్థాయి అత్యా, పత్యా పోటీల్లో యానాం శారదా విద్యా నికేతన్ విద్యార్థిని చింతా శ్రీదుర్గాలక్ష్మీ షణ్ముఖప్రియ ఉత్తమ ప్రతిభను చాటుకుంది. పుదుచ్చేరి రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహించి ఇండియా లెవెల్లో బంగారు పతకం దక్కించుకుందని హెచ్ఎం చిక్కాల వెంకటేశ్వరరావు తెలిపారు. ఉత్తమ ప్రతిభను చాటుకున్న విద్యార్థినిని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, శారదా విద్యానికేతన్ ప్రతినిధులు కంచర్ల చిన్నాబ్బాయి, కాపగంటి ఉమా శంకర్, కంచర్ల శ్రీనివాస్, వ్యాయామ ఉపాధ్యాయుడు చింతా వెంకన్న, ఉపాధ్యాయులు అబినందనలు తెలిపారు.

శంఖవరంలో అవగాహనా ర్యాలీ

ప్రజాశక్తి - శంఖవరం

ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

శంఖవరంలో మానసిక వికలాంగులపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. మంగళవారం స్థానిక పర్వత సత్యనారాయణమూర్తి జడ్పి పాఠశాలలో ఎంఇఒ సూరిశెట్టి వెంకటరమణ అధ్యక్షతన అవగాహన కార్యక్రమం జరిగింది.కొందరు విద్యార్థులు చదవడం, రాయడంపై మతిమరుపు కలిగి ఉంటారని, వీరికి ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చినట్లయితే చదవడం రాయడం చేయగలుగుతారని తెలిపారు. అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం భాస్కర లక్ష్మీ, ఇతర అధికారులు కె.వెంకటేశ్వరరావు, జి.స్వప్న, డి.బ్రహ్మానందరావు, బి.నాగార్జున, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తాళ్లరేవులో అత్యధిక వర్షపాతం

ప్రజాశక్తి - తాళ్లరేవు రూరల్

ఎడతెరిపి లేకుండా సోమవారం రాత్రి నుంచి మంగళవారం తెల్లవారు జాము వరకు తాళ్లరేవు లో భారీ వర్షం కురిసింది. తాళ్లరేవు మండలంలో అత్యధికంగా 124 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. మండలంలోని రహదారులు నీట మునిగి ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు.

దరఖాస్తులకు 28 వరకూ గడువు

ప్రజాశక్తి - యానాం రూరల్

యానాంకు చెందిన ఎస్సి, ఎస్టి విద్యార్థులు ఆన్లైన్లో ఎన్ఎస్పి ద్వారా ఉపకారవేతనాలకు దరఖాస్తు చేసుకోవడానికి గడువును ఈ నెల 28 వరకూ పొడిగించినట్టు ఆదిద్రావిడ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రేకాడి కృష్ణమూర్తి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రీమెట్రిక్, పోస్ట్ మెట్రిక్ తదితర ఉపకార వేతనాలకు ఆయా ఎస్సి విద్యార్థులు గడువు లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

పాస్పోర్టు పోయినది

రాకుర్తిపాలెం గ్రామానికి చెందిన సింగంశెట్టి వీర వెంకట వరప్రసాద్ అను నేను రాకుర్తిపాలెం మా ఇంటి వద్ద నుండి కొత్తపేట జిరాక్స్ నిమిత్తం మోటార్ సైకిల్ మీద వెళుతుండగా దారి మార్గంలో నెంబర్ **F7412673** పాస్పోర్టు పడిపోయినది. దొరికినవారు ఈక్రింది అడ్రస్కు అందజేయగలరు.

సింగంశెట్టి వీర వెంకట వరప్రసాద్
తండ్రి: సత్యనారాయణమూర్తి
రాకుర్తిపాలెం, మోడేకుర్రు శివారు
కొత్తపేట మండలం
డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా
సెల్: 76759 90806

బాండ్ పడిపోయినది

కాకినాడ జిల్లా, సర్పవరం, వసంతనగర్, యర్రంశెట్టి పద్మావతి కు సంబంధించిన ది కాకినాడ కోఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ లిమిటెడ్కు చెందిన ఫిక్స్డ్ డిపాజిట్ బాండ్ పడిపోయినది. బాండ్ నెంబర్: **AP-002-FD-I-426306.** ది. 05-10-2024వ తేదీన బాండ్ను జిరాక్స్ తీయించుకుని సర్పవరం నుండి ఇంటికి వెళు తుండగా మార్గం మధ్యలో పడిపోయినది. దొరికినవారు ఈక్రింది అడ్రస్కు అందజేయగలరు.

యర్రంశెట్టి పద్మావతి
డోర్ నెంబర్: 3-402/29
సర్పవరం, వసంత నగర్, కాకినాడ
సెల్: 7842323932

మహారాజశ్రీ 1వ అదనపు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, రాజమహేంద్రవరం
O.S. No. 64/2022

Between:
Karra Surya Prakasa Rao ...*Plaintiff*
AND
Tummal Tata Naidu and Others ...*Defendants*
D-2: Dontamsetti Ekambaram, S/o. late Mallikarjuna Lingam, age 51 years, Business, D.No. 3-2, Society Street, Veeravaram Village, Kadiyam Mandal. ...*2nd Defendant*

పై నెంబరు దావాలో 2వ ప్రతివాది అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు/ నోటీసులు పంపినా మీరు వాటిని తీసుకోకుండా ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున **ది. 05-11-2024 సం॥రం తేదీ ఉదయం 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై దావాలో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేనియెడల సదరు దావాను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

వి.విజయ భాస్కరరావు
రాజమండ్రి **ఐ.రాంబాబు**
15-10-2024 అడ్వకేట్స్, రాజమండ్రి

మహారాజశ్రీ అమలాపురం సివిలు జడ్జి (సీనియరు డివిజన్) వారి కోర్టులో
E.A. No. 13/2022 in E.P. 19/2020 in O.S. No. 152/2003

Between:
రెడ్డి అండ్ రెడ్డి ఇంపోర్ట్సు అండ్ ఎక్స్పోర్ట్సు, భీమవరం తరపున మే॥ పార్ట్నర్ జి.ఆర్.కె.రెడ్డి -*పిటీషనరు/ DHr*
ఎదిరి
2. కట్టా నానాజీ, S/o. లేటు శ్రీహరి, హిందువు, గోడిలంక, అల్లవరం మండలం, పూర్వపు తూర్పుగోదావరి జిల్లా.
3. కట్టా బ్రహ్మాజీ, S/o. లేటు శ్రీహరి, హిందువు, గోడిలంక, అల్లవరం మండలం, పూర్వపు తూర్పుగోదావరి జిల్లా **-రెస్పాండెంట్లు**

పైన పేర్కొన్న డిక్రీ అమలు గ్రంథములో చనిపోయిన 1వ JDr అయిన లేటు కట్టా శ్రీహరి గార్కి వారసులు అయిన మిమ్ములను వారి స్థానే పార్టీలుగా చేర్పించమని దాఖలు చేసిన పిటిషనులో కోర్టు నుండి ఎన్నిమార్లు నోటీసులు పంపించినప్పటికి డిక్రీ అమలు విషయము తెలిసి యుండి డిక్రీ బాకీ ఎగవేయు దురుద్దేశ్యముతో బుద్ధిపూర్వకముగా నోటీసులు తీసుకొనకుండా కాలయాపన చేయుచున్నందున మీపై అమలు జరగవలసిన నోటీసులు ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయమని శ్రీ కోర్టు వారు మీ యొక్క హాజరు నిమిత్తం **ది. 01-11-2024 సం॥ తేదీకి వాయిదా వేసియున్నారు. కావున వాయిదా తేదీన పైన పేర్కొన్న కోర్టులో ఉదయం గం॥ 10.30 ని॥లకు** మీరు స్వయముగా గాని, వకీలు ద్వారా గాని హాజరై యుందులకు ఆక్షేపణలు ఉన్న ఎడల తెలుపుకొన వలయును. లేనియెడల మీ పరోక్షమందు పై పిటీషను గ్రంధము తీర్మానించబడునని గ్రహించలయును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ననుసరించి)

వీరా నాగేశ్వరరావు
పిటీషనరు తరపు న్యాయవాది
అమలాపురం పళ్ళ వెంకట్రావు వీధి, అమలాపురం
ది.12-10-2024 సెల్: 9948882983

వేలం ప్రకటన
మహారాజశ్రీ కొవ్వూరు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
E.P. 11/2014 in O.S. No. 322/2011

Between:
1. దావాల రాజు -డిక్రీ హోల్డర్
AND
1. పూసపూడి పేరయ్యశాస్త్రి, తండ్రి: గోపాలకృష్ణ, చిక్కాల, చాగల్లు మండలం.
2. పూసపూడి రాజేశ్వరి, భర్త: వెంకటేశ్వరరావు, చిక్కాల, చాగల్లు మండలం. ...*JDrs*

పై నెంబరు E.P. గ్రంధములో డిక్రీ హోల్డరు తన బాకీ రాబట్టుకొను నిమిత్తం JDrs తాలూకు EP Schedule దాఖలా ఆస్తిని **ది. 05-11-2024వ తేదీన ఉదయం గం॥ 10.30 నిమిషములకు** పై కోర్టులో వేలం వేయుదురు. ఆసక్తి వున్నవారు వేలములో పాల్గొనవచ్చును. పూర్తి వివరములకు డిక్రీ హోల్డర్ ప్లీడరు గారిని గాని, కోర్టు అమీనా గారిని గానీ సంప్రదిందవచ్చును.

షెడ్యూలు

పశ్చిమగోదావరి జిల్లా, ప్రస్తుతం తూర్పుగోదావరి జిల్లా, నిడదవోలు SRO లిమిట్స్, చాగల్లు మండలం, చిక్కాల గ్రామపంచాయతి లిమిట్స్, చిక్కాల గ్రామం, ఆర్.ఎస్. నెం. 798/2, య. 0-14 సెంట్లు స్థలము, అందలి ఆర్సిసి బిల్డింగ్ డోర్ నెం. 3-25 కి హద్దులు.
తూర్పు: రాజ వీధి. **దక్షిణం:** పూసపూడి సుబ్బారావు, **పడమర:** పట్టపగలు ప్రసాదరావు, వగైరా. **ఉత్తరం:** పట్టపగలు చంద్రరావు, కాలనీకి దారి.
పై హద్దుల మధ్య య. 0-14 సెంట్లు స్థలము అందలి ఆర్సిసి బిల్డింగ్ మరియు తలుపులు, కిటికీలు, అన్ని యీజిమెంటు హక్కులతో సహా వేలం కావలసి ఉన్నది.

డిక్రీ హోల్డరు విలువ: రూ. 1,00,000/-
అమీనా విలువ: రూ. 20,00,000/-
సబ్ రిజిస్ట్రార్ విలువ: రూ. 24,14,000/-
వేలం తేదీ: 05-11-2024

ఆత్కూరి సత్యనారాయణ
డిక్రీ హోల్డరు తరపు అడ్వకేట్
కొవ్వూరు కొవ్వూరు
ది.11-10-24 సెల్: 9849847197

అక్షరాస్యతను పెంపొందించేందుకు 'ఉల్లాస్'

ప్రజాశక్తి - అమలాపురం సిటీ

నిరక్షరాస్యుల్లో ఆర్థిక, డిజిటల్, ఫంక్షనల్ అక్షరాస్యతను పెంపొందించే దిశగా ఉల్లాస్ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టామని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్కుమార్ తెలిపారు. మంగళవారం ఆర్థిక డిజిటల్, ఫంక్షనల్ అక్షరాస్యత పేరిట ఉల్లాస్ కార్యక్రమం నిర్వహణ విధివిధానా లపై జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సంబంధిత అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15 సంవత్సరాలు పైబడిన స్వయం సహాయక సంఘ నిరక్షరాస్య మహిళలు, పాఠశాలల్లో పనిచేసే ఆయాలు, వంటపనిచేసేవారు, హెల్పర్లు, నైట్ వాచ్మెన్లు అంగన్వాడీ ఆయాలు అందరికీ ఆర్థిక ఫంక్షనల్ డిజిటల్ అక్షరాస్యతను నేర్పించే దిశగా ఉల్లాస్ కార్యక్ర మాన్ని ప్రవేశపెట్టినట్లు ఆయన తెలిపారు. కోనసీమ జిల్లా వ్యాప్తంగా 7,128 మందినీ లక్ష్యంగా నిర్దేశించినట్లు ఆయన పేర్కొన్నారు .జిల్లావ్యాప్తంగా తక్కువ అక్షరాస్యత కలిగిన 9 మండలాలైన ఆలమూరు, కపిలేశ్వరపురం, కాట్రేనికోన ఆత్రేయపురం, రావులపాలెం రాయవరం, ఐ.పోలవరం, కె.గంగవరం మండపేట మండలాలలో నిరక్షరాస్యులను ఎంపిక చేసి అక్షరాస్యులుగా తీర్చిదిద్దనున్నట్లు ఆయన తెలిపారు. ఈ మండలాలలో నిరక్షరాస్యులకు పాఠాలు బోధించే వాలంటరీ టీచర్లను కమ్యూనిటీ కోఆర్డినేటర్లు, విఎఒల ద్వారా ఎంపిక చేయాలని ఆయన స్పష్టం చేశారు. వాలంటరీ టీచర్లను, నిరక్షరాస్యులను 1: 10 నిష్పత్తిలో మ్యాపింగ్ చేసి వారి వివరాలను ఈ నెల 16 నుంచి 24వ తేదీ వరకు ఉల్లాస యాప్ లో అప్డేట్ చేయాలని ఆయన సూచించారు. అక్టోబర్ 25న రాష్ట్రస్థాయిలో జిల్లాస్థాయి రిసోర్స్ పర్సన్స్కు, అక్టోబర్ 29న జిల్లాస్థాయిలో మండల స్థాయి రిసోర్స్ పర్సన్స్కు , నవంబర్ 2న మండల స్థాయిలో వాలంటరీ టీచర్లు, విఒఎ, క్లస్టర్ కోఆర్డినేటర్లకు కార్యక్రమాన్ని ఎలా నిర్వహించాలనే అంశంపై శిక్షణిస్తారని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాల్లో సాయంత్రం నాలుగు గంటల నుండి 6 గంటల వరకు ఆరు నెలల కాల వ్యవధిలో 200 గంటలు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తారని తెలిపారు. నవంబర్ 5 నుంచి 2025 మార్చి 15 వరకు తరగతులు నిర్వహిస్తారని ఆయన తెలిపారు. తదుపరి మార్చి నెలలో పరీక్షలు నిర్వహించి ధ్రువపత్రాలను పంపిణీ చేస్తారన్నారు. జిల్లా గ్రామీణాభివద్ధి, మహిళా శిశు సంక్షేమం, పాఠశాల విద్య అధికారులు సంబంధిత మండలాలలో వారి పరిధిలోని నిరక్షరాస్యులను గుర్తించాలన్నారు. అంగన్వాడీ కేంద్రాలను సాయంత్రం నాలుగు గంటల నుంచి 6 గంటల వరకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడానికి అణువుగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని మహిళ శిశు సంక్షేమ శాఖ అధికారులను ఆదేశించారు.కార్యక్రమంలో జిల్లా వయోజన విద్యా అధికారి పి.పోసయ్య, డిఆర్డిఎ పీడీ డాక్టర్ శివ శంకర్ ప్రసాద్, డిఇఒ ఎం.కమల కుమారి, డిఐ పిఆర్ఒ కె.లక్ష్మీనారాయణ, డిపిఒ శాంతి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వాడివేడిగా మండల పరిషత్ సమావేశం

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

మండల పరిషత్ సమావేశంలో ఎంఎల్ఎ వేగుళ్లను ప్రశ్నిస్తున్న ఎంపిటిసి మధు

స్థానిక మండల పరిషత్ సమావేశం మందిరం లో ఎంపిపి మేడిశెట్టి సత్యవేణి దుర్గారావు అధ్యక్షతన మండల పరిషత్ సమావేశం మంగళవారం వాడీవేడిగా జరిగింది. కపిలేశ్వరపురం మండలంలోని అచ్యుతాపురం గ్రామంలో 2014లో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన గోకులం రైతుకు బిల్లులు ఎలా మంజూరు చేశారంటూ వైసిపి గ్రామ ఎంపిటిసి మండల విప్ పలివెల మధు పశుసంవర్ధక శాఖ అధికారిలను ప్రశ్నించారు. దీనిపై ఎంఎల్ఎ వేగుళ్ళ కలగజేసుకొని అప్పుడు మా ప్రభుత్వం హయాంలోనే కదా జరిగింది. అప్పుడు ఏం చేశారంట ఎంఎల్ఎ వేగుళ్ళ ప్రశ్నించారు. దీనిపై ఎంపిటిసి మాట్లాడుతూ మీరు ఎన్ని సమావేశానికి హాజరయ్యారంటూ ఎంఎల్ఎ వేగుళ్లను నిలదీయడంతో నీకు చెప్పవలసిన పని లేదంటూ ఎంపిటిసిపై ఎంఎల్ఎ ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో సమావేశంలో ఇద్దరు మధ్య కొద్దిసేపు వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ సమావేశానికి ఎంఎల్ఎ వేగుళ్ళ, ఎంఎల్సి తోట త్రిమూర్తులు, హాజరయ్యారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ కె.రత్నకుమారి అభివృద్ధి కార్యక్రమాల గురించి మాట్లాడారు. అంగర ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి దాతలు సహకారంతో అదనపు భవనం నిర్మించారని, వైద్యులు కొరత భర్తీ చేయాలని అంగర ఎంపిటిసి సభ్యుడు అడ్డాల శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జెడ్పిటిసి సభ్యుడు పుట్టపూడి వీర వెంకట సూర్యనారాయణ, ఎంపిడిఒ కె.రత్నకుమారి, తహశీల్దార్ చిన్నారావు, పిఆర్ జెఇ రాఘవులు, పలు గ్రామాల సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.